
సాక్షి
శ్రీసత్యసాయి జిల్లా

ఆదివారం । 26 । మార్చి । 2023



టమాట కిలో రూ.20
కక్కలపల్లి మండీలో శనివారం కిలో టమాట ధర గరిష్టంగా రూ.20, కనిష్టంగా రూ.4, సరాసరిన రూ.7.50 పలికింది. మార్కెట్‌కు 222 టన్నులు అమ్మకానికి వచ్చాయి.



చీనీ టన్ను రూ.32 వేలు
అనంతపురం వ్యవసాయ మార్కెట్ యార్డులో శనివారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.32 వేలు పలికాయి. మార్కెట్‌కు 490 టన్నులు అమ్మకానికి వచ్చాయి.

గరిష్టం/కనిష్టం
39.5°/21.1°
జిల్లాలో శనివారం ఉష్ణోగ్రతలు పెరగడంతో వేసవితాపం మొదలైంది. మధ్యాహ్నం వేళ ఎండ తీవ్రత అధికమైంది. గంటకు 8 నుంచి 10 కిలో మీటర్ల వేగంతో నైరుతి దిశగా గాలి వీచింది.



రంజాన్ వేళలు

ఆదివారం	సోమవారం
ఇఫ్తార్	సెహరి
6.33	5.02

మహిళాభ్యుదయమే ధ్యేయం

కలెక్టర్ బసంత్‌కుమార్
- 'వైఎస్సార్ ఆసరా' మూడో విడత నిధులు ఖాతాల్లో జమ
- జిల్లాలోని 2,77,574 మందికి రూ.216.55 కోట్ల లబ్ధి



'వైఎస్సార్ ఆసరా' చెక్కును లబ్ధిదారులకు అందజేస్తున్న కలెక్టర్ బసంత్‌కుమార్

పుట్టపర్తి అర్బన్: మహిళాభ్యుదయమే ధ్యేయంగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని కలెక్టర్ బసంత్‌కుమార్ అన్నారు. మహిళాభివృద్ధితోనే కుటుంబాలు ఆర్థికంగా నిలదొక్కుకుంటాయని భావించి మహిళల కోసం అనేక పథకాలు అమలు చేస్తున్నారని, అందులో 'వైస్సార్ ఆసరా' కూడా ఒకటన్నారు. శనివారం ఏలూరు జిల్లా దెందులూరులో 'వైఎస్సార్ ఆసరా' మూడో విడత ఆర్థిక సాయాన్ని అక్క చెల్లెమ్మల ఖాతాల్లో జమ చేసే కార్యక్రమాన్ని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కంప్యూటర్‌లో బటన్‌నొక్కి ప్రారంభించారు. కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాలు నుంచి కలెక్టర్ బసంత్‌కుమార్, రాష్ట్ర వక్కలిగ కార్పొరేషన్ చైర్‌పర్సన్ డాక్టర్ నళిని, 'పుడా' చైర్ పర్సన్ లక్ష్మీనరసమ్మ, మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ శ్రీలక్ష్మి, డీఆర్‌డీఏ పీడీ నరసయ్య, స్వయం సహాయక మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు. అనంతరం జిల్లాలో 28,127 స్వయం సహాయక సంఘాల్లోని 2,77,574 మంది సభ్యులకు విడుదలైన రూ.216.55 కోట్లకు సంబంధించిన మెగా చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, స్వయం సహాయక సంఘాల్లోని మహిళలకు ఆర్థిక పురోభివృద్ధికి 'వైఎస్సార్ ఆసరా' ఎంతో దోహదం చేస్తోందన్నారు. వైఎస్సార్ ఆసరా పథకం కింద 2020 సెప్టెంబర్ 11న తొలి విడతలో జిల్లాలోని 27,941 సంఘాలకు రూ.214.37 కోట్లు, 2021 అక్టోబర్ 7న రెండో విడతలో 28,071 సంఘాలకు రూ.217.11 కోట్లు లబ్ధి కలిగిందన్నారు. ప్రభుత్వం అందించిన సాయాన్ని మహిళలు సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా అభివృద్ధి చెందాలన్నారు.

దగాకోరు చంద్రబాబు..
రాష్ట్ర వక్కలిగ కార్పొరేషన్ చైర్‌పర్సన్ నళిని, 'పుడా' చైర్ పర్సన్ లక్ష్మీనరసమ్మ మాట్లాడుతూ, మాటిచ్చి తప్పడం చంద్రబాబుకు అలవాటన్నారు. ఈక్రమంలోనే 2014 ఎన్నికల్లో పొదుపు సంఘాల రుణాలన్నీ మాఫీ చేస్తానని చెప్పి దగా చేశాడని అన్నారు. చంద్రబాబు రుణమాఫీ హామీ నమ్మిన డ్వాక్రా మహిళలు రుణాలు చెల్లించకపోవడంతో సంఘాలన్నీ దివాళా తీశాయన్నారు. బ్యాంకులు నోటీసులు పంపడంతో చివరకు బంగారు తాకట్టు పెట్టి కంతులన్నీ చెల్లించాల్సి వచ్చిందన్నారు. డ్వాక్రా మహిళలకు, రైతులకు, రుణమాఫీలు ఎగ్గొట్టడంతో వారంతా కలిసి టీడీపీ ప్రభుత్వాన్ని మాఫీ చేశారన్నారు. గత మూడేళ్లుగా సీఎం వైఎస్ జగన్ ఎన్నికల హామీలను 99 శాతం అమలు చేయడంతో రాష్ట్ర ప్రజల్లో నమ్మకం పెరిగిందన్నారు. వచ్చే ఎన్నికల్లో కచ్చితంగా ఆయన రుణాన్ని ఓటుతో తీర్చుకుంటామన్నారు.

నమ్మకం పెరిగింది..



ఎన్నికల వేళ ఇచ్చిన హామీలన్నీ నెరవేరుస్తుండటంతో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై నమ్మకం పెరిగింది. రుణమాఫీ చేయడం, సున్నా వడ్డీ, స్త్రీనిధి రుణాలు, ఉన్నతి రుణాలతో ఆదుకుంటున్నారు. అలాగే రైతు భరోసా, ఫీజు రీయింబర్స్‌మెంట్, అమ్మఒడి పథకాలతో ఎందరికో లబ్ధి చేకూర్చారు. అందువల్లే జగనన్నపై ఇప్పుడు అందరికీ నమ్మకం పెరిగింది. మా సంఘం ఎన్నికల నాటికి రూ.6.30 లక్షల రుణం తీసుకోగా, విడతల వారీగా అందిస్తుండటం సంతోషంగా ఉంది.

– పుష్పలత, వినాయక మహిళా సంఘం, చెర్లోపల్లి

రుణం తీర్చుకుంటాం



సీఎం జగన్ ఒక అన్నలా మహిళా లోకానికి ఎంతో సేవ చేస్తున్నారు. కుటుంబ పెద్దగా అందరి అవసరాలను తీరుస్తూ ఆదుకుంటున్నారు. 'వైఎస్సార్ ఆసరా'తో మా గ్రూపు సభ్యులకు రూ.4.70 లక్షల లబ్ధి కలిగింది. మహిళా సంక్షేమానికి పాటుపడుతున్న జగనన్న రుణం తీర్చుకునే సమయం ఆసన్నమైంది. వచ్చే ఎన్నికల్లో మహిళలమంతా కలిసి ఆయన్ను మరోసారి ముఖ్యమంత్రిని చేసుకుంటాం.

– అరుణ, వెన్నెల మహిళా సంఘం, బ్రాహ్మణపల్లి

జీవితాల్లో వెలుగులు నింపారు



వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సీఎంగా బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి మహిళల జీవితాల్లో వెలుగులు నింపారు. అమ్మ ఒడి, విద్యా దీవెన, వసతి దీవెన, చేయూత, కాపునేస్తం, ఇళ్ల పట్టాలు..ఇలా పథకాలన్నీ మహిళల పేరుపైనే అందజేస్తూ మా గౌరవాన్ని పెంచారు. ప్రభుత్వం ఇస్తున్న ఆర్థిక చేయూతతో మేము కూడా నిలదొక్కుకున్నాం. కుటుంబాలకు అండగా నిలిచి పిల్లలను బాగా చదివిస్తున్నాం. జగనన్న రుణం ఎప్పటికీ తీర్చుకోలేం.

– అమల, విఘ్నేశ్వర మహిళా సంఘం, ఎనుములపల్లి

న్యూస్‌రీల్

మొదలైన వేసవితాపం
- 40 డిగ్రీల మార్క్‌ను చేరుకున్న సూరీడు



అనంతపురం అగ్రికల్చర్: మండు వేసవి మొదలైంది. సీజన్‌లో తొలిసారిగా పగటి ఉష్ణోగ్రత 40 డిగ్రీల మార్క్‌ను అధిగమించింది. ఇంతవరకు 37 నుంచి 39 డిగ్రీల మధ్య నమోదైన ఉష్ణోగ్రతలు శనివారం యల్లనూరులో 40.2 డిగ్రీలు నమోదైంది. గుంతకల్లు 40.1 డిగ్రీలు, కూడేరు 40, గుత్తి 39.8, పెద్దవడుగూరు 39.6, పుట్లూరు 39.5, శింగనమల 39.4 డిగ్రీలు... ఇలా చాలా మండలాల్లో ఉష్ణోగ్రతలు పెరిగాయి. అటు శ్రీసత్యసాయి జిల్లా పరిధిలో కూడా ఉష్ణోగ్రతలు 40 డిగ్రీల మార్క్‌కు చేరువైంది. శనివారం తనకల్లులో 39.5 డిగ్రీల గరిష్టం నమోదైంది. మిగతా మండలాల్లో గరిష్టంగా 36 నుంచి 39 డిగ్రీలు, కనిష్టం 21 నుంచి 24 డిగ్రీల మధ్య కొనసాగాయి. 40 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు కావడంతో జిల్లా అంతటా వేసవితాపం మొదలైంది. పగలు, రాత్రి ఉక్కపోత తీవ్రత పెరిగింది. సమీప భవిష్యత్తులో 42 నుంచి 44 డిగ్రీలతో భానుడు భగ్గుమనే పరిస్థితి ఉందని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. వేసవితాపం నుంచి ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరిస్తున్నారు.

పౌష్టికాహారం పక్కాగా పంపిణీ కావాలి

పుట్టపర్తి అర్బన్: ఐసీడీఎస్ ద్వారా గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు పౌష్టికాహారం పక్కాగా పంపిణీ కావాలని కలెక్టర్ బసంత్‌కుమార్ ఆదేశించారు. శనివారం ఐసీడీఎస్ పీడీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో కలెక్టర్ పాల్గొని మాట్లాడారు. సిబ్బంది అందరూ సమన్వయంతో పనిచేసి సుస్థిరాభివృద్ధి లక్ష్యాలను చేరుకోవాలని సూచించారు. రక్తహీనతతో బాధపడే మహిళలకు, వయసుకు తగ్గ ఎత్తుకు తగ్గ బరువు లేని పిల్లలకు సక్రమంగా పౌష్టికాహారం అందించి ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. విధుల్లో పారదర్శకత ఉంటే ప్రజలు, అధికారులు గుర్తిస్తారన్నారు. లక్ష్య సాధనలో ఎటువంటి సమస్యలు వచ్చినా ఉన్నతాధికారులను సంప్రదించి సమస్యలను పరిష్కరించుకోవాలన్నారు. కార్యక్రమంలో పీడీ లక్ష్మీకుమారి, సీడీపీఓలు గాయత్రి, రెడ్డిరమణమ్మ, శాంతలక్ష్మి , అనురాధ, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

ఫార్మా ఫలితాల విడుదల

అనంతపురం: జేఎన్‌టీయూ అనంతపురం పరిధిలో ఫిబ్రవరి, మార్చి - 2023లో నిర్వహించిన బీఫార్మసీ మొదటి సంవత్సరం ఒకటో సెమిస్టర్ (ఆర్-15), (ఆర్-19), రెండో సెమిస్టర్ (ఆర్-15), (ఆర్-19) సప్లిమెంటరీ ఫలితాలు, ఫార్మా డీ మొదటి సంవత్సరం (ఆర్-14) సప్లిమెంటరీ, ఎం ఫార్మసీ మూడో సెమిస్టర్ (ఆర్-17) సప్లిమెంటరీ పరీక్ష ఫలితాలను విడుదలయ్యాయి. ఈ మేరకు డైరెక్టర్ ఆఫ్ ఎవాల్యుయేషన్స్ ప్రొఫెసర్ ఈ.కేశవ రెడ్డి, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ బి.చంద్రమోహన్‌రెడ్డి శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. పరీక్ష ఫలితాల కోసం జేఎన్‌టీయూ (ఏ) వెబ్‌సైట్ చూడాలని సూచించారు.

ప్రశాంతంగా ఇంటర్ పరీక్షలు


ప్రశాంతి నిలయం: ఉమ్మడి అనంతపురం జిల్లా వ్యాప్తంగా ఇంటర్ పరీక్షలు ప్రశాంతంగా జరుగుతున్నాయి. శనివారం 99 కేంద్రాల్లో జరిగిన ఇంటర్ మొదటి సంవత్సరం ఫిజిక్స్, ఎకనామిక్స్ పరీక్షలకు 974 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. జనరల్ విద్యార్థులు 28,866 మందికి గాను 28,064 మంది హాజరయ్యారు. 802 మంది గైర్హాజరయ్యారు. ఇక ఒకేషనల్ విద్యార్థులు 2,705 మందికి గాను 2,533 మంది పరీక్షలు రాయగా, 172 మంది గైర్హాజరయ్యారు.

కేజీబీవీల్లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

ప్రశాంతి నిలయం: జిల్లాలోని 30 కస్తూర్బా గాంధీ విద్యాలయాల్లో 2023-24 విద్యాసంవత్సరానికి సంబంధించి 6, 11వ తరగతుల్లో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు సమగ్ర శిక్ష జిల్లా ప్రాజెక్ట్ అధికారి, డీఈఓ మీనాక్షి శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆసక్తి కలిగిన వారు ఈ నెల 27 నుంచి ఏప్రిల్ 20వ తేదీలోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. దరఖాస్తులు http://apkgbv.apcfss.in/ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉన్నాయన్నారు. అనాథలు, పాక్షిక అనాథలు, బడి బయట ఉన్న పిల్లలు, డ్రాపౌట్స్ బాలికలు, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ, వలస కుటుంబాలకు చెందిన పిల్లలు, దారిద్ర్యరేఖకు దిగువన ఉన్న బాలికలు అర్హులన్నారు. 6వ తరగతి, ఇంటర్‌తో పాటు 7, 8 తరగతులలో మిగిలిన సీట్లకు కూడా దరఖాస్తులు స్వీకరిస్తున్నామన్నారు. ఎంపికైన వారికి ఫోన్ ద్వారా సమాచారం అందుతుందన్నారు.

ప్రశ్నపత్రంపై ప్రత్యేక నిఘా

లీక్ చేస్తే అడ్డంగా దొరికిపోతారు..
- ఏ ఒక్క విద్యార్థి నేలపై కూర్చోకూడదు
- అన్ని పరీక్షా కేంద్రాల్లోనూ ఫర్నీచరు ఉండాలి
- ఆర్జేడీ, ఉమ్మడి జిల్లా పరీక్షల పరిశీలకుడు ప్రతాప్‌రెడ్డి



వెబ్ కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న ఆర్జేడీ ప్రతాప్‌రెడ్డి

రాప్తాడురూరల్: ఏప్రిల్ 3 నుంచి జరిగే పదో తరగతి పరీక్షల్లో ఎవరైనా ప్రశ్నపత్రాలు లీక్ చేస్తే.. అడ్డంగా దొరికిపోయేలా టెక్నాలజీ రూపొందించామని పాఠశాల విద్యాశాఖ ఆర్జేడీ, ఉమ్మడి అనంతపురం జిల్లా పరీక్షల పరిశీలకుడు బి.ప్రతాప్‌రెడ్డి తెలిపారు. శనివారం ఆయన ఉమ్మడి అనంతపురం జిల్లాల డీఈఓలు, డీవైఈఓలు, ప్రభుత్వ పరీక్షల అసిస్టెంట్ కమిషనర్లు, ఎంఈఓలు, సీఎస్, డీఓలతో వెబ్ కాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. ప్రశ్నపత్రాలు లీక్ కాకుండా ప్రత్యేక నిఘాతో గట్టి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఒక వేళ పేపర్ లీక్ అయితే అది ఏ విద్యార్థిది, ఏ సెంటర్ నుంచి లీక్ అయిందో నిమిషంలో తెలుసుకునేలా టెక్నాలజీని ఉపయోగిస్తున్నామన్నారు. ఏ ఒక్క విద్యార్థీ నేలపై కూర్చుని పరీక్ష రాయకూడదన్నారు. ప్రతి పరీక్షా కేంద్రంలోనూ ఫర్నీచరు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ప్రతి సెంటర్‌లోనూ ఇద్దరు మహిళా ఇన్విజిలేటర్లు ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. అమ్మాయిలను మహిళా టీచర్లు మాత్రమే తనిఖీ చేయాలన్నారు. అవాంఛనీయ ఘటనలు జరగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. విద్యార్థులు ప్రశాంతంగా పరీక్షలు రాయడానికి మంచి వాతావరణం కల్పించాలని సూచించారు. సీఎస్, డీఓల్లో గతంలో పనిచేసిన వారు ఒక్కరైనా ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. లైట్లు, ఫ్యాన్లు, తాగునీరు, మరుగుదొడ్లు తదితర వసతులు ఏర్పాటు చేయాలన్నారు. ఈ నెల 29లోపు అన్ని వసతులూ కల్పించాలని ఆదేశించారు. ప్రైవేట్ స్కూల్లో పరీక్షా కేంద్రం ఉంటే పరీక్షలు జరిగేటప్పుడు ఆ స్కూల్ సిబ్బందిని లోపలికి అనుమతించకూడదన్నారు. సమావేశంలో డీఈఓలు ఎం.సాయిరామ్, మీనాక్షి, ప్రభుత్వ పరీక్షల అసిస్టెంట్ కమిషనర్ గోవిందునాయక్ పాల్గొన్నారు.

ఈ-క్రాప్‌లో అవకతవకలు

- అనర్హులకు పంటల బీమా వర్తింపు
- అర్హులకు విస్తీర్ణం తగ్గించి అన్యాయం
- వీఏఏలు, వీహెచ్‌ఏలు, వీఎస్ఎస్‌లు, వీఆర్‌ఏలే బాధ్యులు
- శాఖాపరమైన చర్యలకు సిఫార్సు చేసిన వ్యవసాయ శాఖ

అనంతపురం అగ్రికల్చర్: ఖరీఫ్- 2021 ఈ క్రాప్ - నమోదులో అవకతవకలు జరిగినట్లు రాష్ట్ర ప్రభుత్వం గుర్తించింది. బాధ్యులపై చర్యలకు సిఫారసు చేసినట్లు వ్యవసాయ శాఖ అధికారులు తెలిపారు. ఇటీవల ప్రిన్సిపల్ సెక్రటరీ గోపాలకృష్ణ ద్వివేది ఆదేశాలు జారీ చేశారన్నారు. 2021 ఖరీఫ్‌లో వైఎస్సార్ ఉచిత పంటల బీమా కింద 2022 జూన్‌లో రాష్ట్ర ప్రభుత్వం ఉమ్మడి అనంతపురం జిల్లాలోని 4 లక్షల మంది రైతులకు రూ.855.55 కోట్ల పరిహారం విడుదల చేసింది. అయితే బీమా మంజూరులో అన్యాయం జరిగినట్లు కొందరు రైతులు, ప్రజాప్రతినిధులు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడంతో ఈ-క్రాప్ అక్రమాలు వెలుగులోకి వచ్చాయి.

భూమి లేకున్నా బీమా..
భూమి లేకున్నా.. పంటలు సాగు చేయకున్నా కొందరు రైతులకు పరిహారం వచ్చిందని గుర్తించారు. మరికొందరు రైతులు ఒక ఎకరాలో పంట సాగు చేస్తే.. రెండు మూడు ఎకరాలు చూపించి ఎక్కువ మొత్తంలో పరిహారం తీసుకున్నట్లు వెల్లడైంది. మరికొన్ని చోట్ల ఒక పంట బదులు మరొక పంటను ఈ-క్రాప్‌లోకి చేర్చడంతో పరిహారం తారుమారైనట్లు అధికారులు గుర్తించారు. ఇలాంటి తప్పిదాలకు పాల్పడిన విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్లు, విలేజ్ హార్టికల్చర్ అసిస్టెంట్లు, విలేజ్ సెరికల్చర్ అసిస్టెంట్లతో పాటు విలేజ్ రెవెన్యూ ఆఫీసర్లను బాధ్యులను చేస్తూ ఉత్తర్వులు వెలువడ్డాయి. ఉరవకొండ, మడకశిర, శింగనమల, రాప్తాడు, పుట్టపర్తి, పెనుకొండ, హిందూపురం, తాడిపత్రి నియోజక వర్గాల పరిధిలో 70 మంది రైతులకు భూమి లేకున్నా, పంట వేయకున్నా పరిహారం వచ్చినట్లు గుర్తించారు. మరో 13 మంది రైతుల పంటల సాగు విస్తీర్ణం బాగా పెంచి చూపించినట్లు గుర్తించి... అందుకు బాధ్యులైన వారిపై శాఖాపరమైన చర్యలకు సిఫారసు చేసినట్లు తెలుస్తోంది.

ఆదివారమూ సబ్ రిజిస్ట్రార్ సేవలు!

ప్రశాంతి నిలయం: జిల్లా వ్యాప్తంగా ఉన్న సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలన్నీ ఈ నెల 26వ తేదీ ఆదివారం పనిచేస్తాయని జిల్లా రిజిస్ట్రార్ కృష్ణకుమారి శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆర్థిక సంవత్సరం ముగుస్తున్న నేపథ్యంలో ఆస్తుల క్రయ విక్రయాలు ఎక్కువగా జరిగే అవకాశం ఉన్నందున ఈ మేరకు నిర్ణయం తీసుకున్నామన్నారు. ఆస్తుల క్రయవిక్రయ దారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

తల్లిదండ్రుల బాధ్యత పిల్లలదే



మాట్లాడుతున్న కలెక్టర్ బసంత్‌కుమార్

పుట్టపర్తి అర్బన్: వృద్ధాప్యంలో ఉన్న తల్లిదండ్రుల పోషణ బాధ్యత ముమ్మాటికీ సంతానానిదేనని, దీన్ని ఉల్లంఘించిన వారు చట్ట ప్రకారం శిక్షార్హులవుతారని కలెక్టర్ బసంత్‌కుమార్ అన్నారు. శనివారం కలెక్టరేట్‌లోని వీసీ హాల్లో 'వయోవృద్ధులు, తల్లిదండ్రుల నిర్వహణ, పోషణ చట్టం-2007'పై జిల్లా స్థాయి అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, వయోవృద్ధుల కోసం ప్రభుత్వం అమలు చేసే పథకాలు, చట్టంలో పొందు పరచిన హక్కుల గురించి అందరూ అవగాహన చేసుకోవాలన్నారు. వయోవృద్ధుల చట్టం సీనియర్ సిటిజన్లకు రక్షణ కల్పించడంతో పాటు హక్కులను కాపాడుతుందన్నారు. అలాగే వైద్య సదుపాయం అందేలా చూడటంతో పాటు వారి ఆస్తులకు కూడా రక్షణకల్పిస్తుందన్నారు. ప్రభుత్వం కూడా ఏ ఆధారమూ లేని నిరుపేద వృద్ధుల కోసం వసతి గృహాలను ఏర్పాటు చేసిందన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలను విలువలతో, క్రమశిక్షణతో పెంచాలని, అప్పుడే వారు పెద్దవారైన తర్వాత వృద్ధాప్యంలో తల్లిదండ్రులను బాగా చూసుకుంటారన్నారు. కార్యక్రమంలో విభిన్న ప్రతిభావంతుల సహాయ సంచాలకులు అబ్దుల్ రసూల్, ఎంపీడీఓ అశోక్‌కుమార్‌రెడ్డి, పలు ప్రాంతాల నుంచి విచ్చేసిన వృద్ధులు పాల్గొన్నారు.

ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలను ప్రోత్సహించాలి

డీఐఈపీసీ సమావేశంలో కలెక్టర్ బసంత్‌కుమార్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ బసంత్‌కుమార్

పుట్టపర్తి అర్బన్: జిల్లాలో పరిశ్రమలు ఏర్పాటుకు ముందుకు వచ్చే ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలకు తగిన ప్రోత్సాహం ఇవ్వాలని కలెక్టర్ బసంత్‌కుమార్ ఆదేశించారు. సింగిల్ డెస్క్ విధానంలో అనుమతులన్నీ మంజూరు చేయాలన్నారు. శనివారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో జిల్లా పరిశ్రమలు, ఎగుమతుల ప్రోత్సాహక కమిటీ (డీఐఈపీసీ) సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, పీఎంఈజీపీ పథకం వలంటీర్ల ద్వారా కరపత్రాలు అందజేసి పరిశ్రమలు స్థాపించేలా యువతకు అవగాహన కల్పించాలన్నారు. ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలకు అవసరమైన సాయం అందించాలన్నారు. జిల్లాకు కేటాయించిన 'స్టాండప్ ఇండియా' లక్ష్యాలను చేరుకోవాలన్నారు. సింగిల్ డెస్క్ విధానం, గడువులోపు గ్రీవెన్స్‌లు పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం 14 మంది ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలకు మంజూరు చేయాల్సిన పెట్టుబడి సబ్సిడీ ప్రతిపాదనలను కమిటీ ఆమోదించింది. సమావేశంలో జిల్లా పరిశ్రమల అధికారి చాంద్‌బాషా, పర్యావరణ శాఖ అధికారి శంకర్‌రావు, ఏపీఎస్‌పీడీసీఎల్ డీఈఈ మోజెస్, ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ మురళీమోహన్, లీడ్ బ్యాంక్ మేనేజర్ సాయినాథరెడ్డి, స్టేట్ ఫైనాన్స్ కార్పొరేషన్ మేనేజర్ ప్రకాష్, జిల్లా ఫైర్ ఆఫీసర్ శంకరప్రసాద్, దళిత్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ జిల్లా కోఆర్డినేటర్ వెంకటరమణ, గంగాధర్, ప్రసాద్, అహుడా వైస్ చైర్మన్ నరేష్‌కృష్ణ, మునికుమార్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

చిన్నారిపై లైంగిక దాడి.. కామాంధుడికి 20 ఏళ్ల జైలు

పావగడ: చిన్నారిపై లైంగిక దాడికి పాల్పడిన ఓ కామాంధుడికి 20 ఏళ్ల జైలు శిక్ష విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు. వివరాలు.. పావగడ తాలూకా దొమ్మతమరి పంచాయతీ పరిధిలోని యల్లగానగుట్ట నవ గ్రామానికి చెందిన ఏడు సంవత్సరాల చిన్నారిపై అదే గ్రామానికి చెందిన కృష్ణమూర్తి లైంగిక దాడి చేశాడు. నేరేడు పళ్ల ఆశ చూపి చెట్టు వద్దకు తీసుకెళ్లి లైంగిక దాడికి పాల్పడ్డాడు. 2021 జూన్ 30న ఈ ఘటన చోటుచేసుకుంది. దర్యాప్తు చేపట్టిన అప్పటి సీఐ లక్ష్మీకాంత్ నిందితుడిపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి అరెస్ట్ చేశారు. నేరం రుజువు కావడంతో జిల్లా కోర్టు న్యాయమూర్తి పి.సంధ్యా రావ్ కృష్ణమూర్తికి 20 ఏళ్ల జైలు శిక్షతో పాటు రూ.75 వేలు జరినామా విధిస్తూ శనివారం తీర్పు వెలువరించారు. జరినామాలో రూ.70 వేలు బాధితురాలికి అందజేయాలని, దీంతో పాటు జిల్లా న్యాయ సేవా సమితి నుంచి రూ.4 లక్షలు, మొత్తం రూ 4,70,000 ఆర్థిక పరిహారాన్ని బాధితురాలికి అందించాలని ఆదేశించారు.

పెళ్లి కాలేదన్న దిగులుతో యువకుడి ఆత్మహత్య

పెద్దపప్పూరు: పెళ్లి కాలేదన్న దిగులుతో ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిసిన మేరకు... పెద్ద పప్పూరు మండలం చిన్నయక్కలూరు గ్రామానికి చెందిన చలపతి (25) తల్లితో కలసి జీవిస్తున్నాడు. పోలియో కారణంగా ఓ చెయ్యి పనిచేయకుండా పోయింది. చిన్నాచితక పనులతో కుటుంబానికి చేదోడుగా ఉండేవాడు. ఇటీవల చలపతికి పెళ్లి చేయాలని కుటుంబసభ్యులు ప్రయత్నాలు మొదలు పెట్టారు. అయితే వైకల్యం కారణంగా పిల్లనిచ్చేందుకు ఎవరూ ముందుకు రాలేదు. దీనికి తోడు ఇటీవల అనారోగ్య సమస్యలు తలెత్తడంతో ఇక తనకు జీవితంలో పెళ్లి కాదంటూ బంధువులతో చెప్పుకుని బాధపడేవాడు. ఈ క్రమంలోనే తీవ్ర ఆత్మన్యూనతకు లోనై శనివారం సాయంత్రం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. సమాచారం అందుకున్న ఎస్‌ఐ ఖాజాహుస్సేన్ అక్కడకు చేరుకుని చలపతి మృతిపై ఆరా తీశారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

సొంతిల్లు సాకారం



ఇక్కడ కనిపిస్తున్న మహిళ పేరు సుంకర ధనలక్ష్మి. ధర్మవరంలో చేనేత మగ్గం నేస్తూ జీవనం సాగిస్తోంది. ఎన్నో ఏళ్లుగా అద్దె ఇంట్లో నివాసం ఉంటూ ప్రతి నెలా డబ్బు చెల్లించలేక అవస్థలు పడుతుండేది. వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే ఈమెకు పోతులనాగేపల్లి లేఅవుట్‌లో స్థలం కేటాయించారు. ప్రభుత్వ సాయం కూడా అందడంతో ఇల్లు నిర్మించుకుని ఉగాది రోజున గృహ ప్రవేశం చేసింది. ఎంతో ఖరీదైన స్థలంలో ఇంటితో పాటు మగ్గం షెడ్ నిర్మించుకోవడంతో ఆమె ఆనందానికి అవధులు లేవు.

ఈమె పేరు ఉక్కిసుల లక్ష్మీదేవి. ధర్మవరం. చేనేత కార్మికురాలు. ప్రభుత్వం మంజూరు చేసిన స్థలంలో ఇల్లు నిర్మించుకుని ఉగాది పండుగ రోజున గృహ ప్రవేశం చేసింది. ఎటువంటి సిఫార్సు లేకుండా అర్హతే ప్రమాణికంగా ఇంటిస్థలంతో పాటు మగ్గం షెడ్ నిర్మాణానికి ప్రభుత్వం సాయం అందించడంతో లక్ష్మీదేవి కుటుంబ సభ్యుల సంతోషం అంతా ఇంతా కాదు.





ధర్మవరంలోని జగనన్న లేఅవుట్‌లో ఇళ్ల నిర్మాణాలు

అద్దె అవస్థలకు టాటా

- జగనన్న లేఅవుట్‌లలో జోరుగా ఇళ్ల నిర్మాణాలు
- ఉగాది రోజున చాలాచోట్ల గృహ ప్రవేశాలు
- పేదల మోముల్లో సంతోషం

ధర్మవరం: ధర్మవరంలో ఎంతో మంది చేనేత కార్మికులు అద్దె ఇళ్లలో ఉంటూ దుర్భర పరిస్థితులు అనుభవించేవారు. టీడీపీ హయాంలో ఎన్నోసార్లు ఇంటి పట్టా మంజూరు చేయాలంటూ ప్రజా ప్రతినిధులు, అధికారుల చుట్టూ తిరుగుతున్నా ఫలితం ఉండేది కాదు. వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే అర్హతే ప్రామాణికంగా అర్హులందరికీ పట్టాలు మంజూరు చేయడంతోపాటు గృహ నిర్మాణానికి సాయం అందించింది. ధర్మవరంలో 6 జగనన్న కాలనీలు ఏర్పాటవుతున్నాయి. 11,536 మందికి పట్టాలు మంజూరయ్యాయి. పట్టణానికి చేరువలో ధర్మవరం -పుట్టపర్తి ప్రధాన రహదారికి ఇరువైపులా పోతుల నాగేపల్లి, పీటీ, పీలలో - 2 లేఅవుట్‌లు ఏర్పాటవుతున్నాయి. కుణుతూరు లేఅవుట్-1, రేగాటిపల్లి లేఅవుట్-1, ఎల్-1, ఎల్-3లో 2 ఉన్నాయి. ఇక్కడ ప్లాట్ విలువ బహిరంగ మార్కెట్‌లో రూ.6 లక్షల నుంచి రూ.8 లక్షలు పలుకుతోంది. ఖరీదైన చోట ప్రభుత్వం స్థలం కేటాయించడంతో చేనేత కార్మికులు, పేద ప్రజలు నిర్మాణాలకు ఆసక్తి కనబరుస్తున్నారు.

ఇతోధిక సాయం...

హౌసింగ్ లబ్ధిదారులకు ప్రభుత్వం ఇళ్లు నిర్మించుకునేందుకు ఇతోధిక సాయం అందిస్తోంది. ప్రతి లేఅవుట్‌లో విద్యుత్, తాగునీరు, రహదారులు, డ్రైన్‌ల ఏర్పాటు వంటి మౌలిక వసతుల పనులను యుద్ధ ప్రాతిపదికన చేపడుతోంది. ఉచితంగా ఇసుక అందుబాటులో ఉంచింది. తక్కువ ధరకు సిమెంట్‌తో పాటు ఐరన్, ప్లంబింగ్, ఎలక్ట్రిక్ వస్తువులు, వాకిళ్లు, కిటికీలు అందిస్తోంది. బిల్లులను త్వరితగతిన మంజూరు చేస్తోంది. రూ.1.80 లక్షల సాయం అందించడంతో పాటు బ్యాంక్ ద్వారా అదనంగా రూ.35 వేలు రుణాన్ని తక్కువ వడ్డీకి అందిస్తోంది.

జిల్లావ్యాప్తంగా నిర్మాణాల జోరు..

ఒక్క ధర్మవరంలోనే కాదు జిల్లా వ్యాప్తంగా జగనన్న లేఅవుట్‌లలో నిర్మాణాలు జోరుగా జరుగుతున్నాయి. జిల్లాలో మొత్తం 168 జగనన్న లేఅవుట్‌లలో 62,716 మందికి ఇళ్లు మంజూరు చేయగా వాటిలో 60,156 మంది నవరత్నాలు పేదలకు ఇళ్ల పథకంలో లబ్ధిదారులు. వీటిలో బేస్‌మెంట్ లెవెల్ 14,151, రూఫ్ లెవల్ 2,727 ఇళ్లు, రూఫ్ లెవెల్ పూర్తి చేసుకున్నవి 2,534 ఉండగా, 8,043 ఇళ్ల నిర్మాణ పనులు పూర్తయ్యాయి. ఇంకా 50,694 నిర్మాణ దశలో ఉన్నాయి.

జిల్లా వ్యాప్తంగా హౌసింగ్ లబ్ధిదారుల వివరాలు..

నియోజకవర్గం	లబ్ధిదారులు	బీఎల్	ఆర్‌సీ	పూర్తయినవి	నిర్మాణదశలో ఉన్నవి
ధర్మవరం	14,466	5,460	403	1904	12,653
హిందూపురం	11,868	1406	448	1605	10,644
కదిరి	3,271	878	209	1605	2,898
మడకశిర	497	174	75	130	492
పెనుగొండ	6,295	1948	649	17,40	5,893
పుట్టపర్తి	18,720	2,795	503	1056	11,893
రాప్తాడు	7,599	14,90	247	1082	6,221

సకాలంలో బిల్లులు



జగనన్న కాలనీలలో ఇళ్ల నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేసేలా చర్యలు చేపట్టాం. మౌలిక వసతుల కల్పనతో పాటు లబ్ధిదారులకు సకాలంలో బిల్లుల మంజూరయ్యేలా అధికారులు నిరంతరం పని చేస్తున్నారు. అంతేకాక గృహ నిర్మాణ సామగ్రిని కొరత లేకుండా సత్వరం అందేలా చేస్తున్నాం.
– చంద్రమౌళీశ్వర్‌రెడ్డి, జిల్లా హౌసింగ్ పీడీ

ఎంతో ఆనందంగా ఉంది



చేనేత కార్మికులకు పెద్ద ఎత్తున ఇంటిపట్టాలను మంజూరు చేయడంతో పాటు మగ్గంషెడ్ నిర్మించుకునేలా 1.50 సెంట్ల స్థలంతో పాటు గృహ నిర్మాణానికి ప్రభుత్వం సాయం అందిస్తోంది. పట్టణానికి చేరువలో విలువైన స్థలంలో జగనన్న కాలనీలు ఏర్పాటవడం ఆనందంగా ఉంది. – కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి, ఎమ్మెల్యే, ధర్మవరం

డిగ్రీ విద్యార్థి కిడ్నాప్

- బాలికతో ప్రేమ వ్యవహారమే కారణం
- గంటలోపే ఛేదించిన అనంత పోలీసులు
- నలుగురిపై కేసు నమోదు

రాప్తాడు రూరల్: డిగ్రీ విద్యార్థి కిడ్నాప్ ఘటన శనివారం అనంతపురం నగరంలో కలకలం రేపింది. సమాచారం అందుకున్న గంటలోపే కిడ్నాపర్లను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వివరాలను అనంతపురం రూరల్ పోలీస్ స్టేషన్ సీఐ విజయభాస్కర్ గౌడ్ వెల్లడించారు. శ్రీసత్యసాయి జిల్లా రామగిరి మండలం పోలేపల్లికి చెందిన తేజ.. అనంతపురంలోని నలంద కళాశాలలో డిగ్రీ రెండో సంవత్సరం చదువుతున్నాడు. కొంతకాలంగా రాప్తాడు మండలానికి చెందిన ఓ బాలిక (ఇంటర్ ద్వితీయ సంవత్సరం)తో ప్రేమ వ్యవహారం నడుపుతున్నాడు. ఈ విషయం తెలుసుకున్న బాలిక తరఫు బంధువులు పలుమార్లు తేజను హెచ్చరించారు. అయినా అతనిలో మార్పు రాలేదు. శనివారం అనంతపురం శివారులోని శ్రీవాణి డిగ్రీ కళాశాలలో పరీక్ష రాసేందుకు తేజ వెళ్లాడు. అదే సెంటర్‌లో పరీక్ష రాసేందుకు వచ్చిన బాలిక సమీప బంధువును తేజ రెచ్చగొట్టేలా మాట్లాడాడు. దీంతో ఆ విద్యార్థి వెంటనే ఫోన్ చేసి విషయాన్ని తన తండ్రికి తెలిపాడు. పరీక్ష ముగిసే సమయానికి బాలిక బంధువులు నలుగురు ద్విచక్ర వాహనాల్లో అక్కడకు చేరుకుని తేజను బలవంతంగా బైక్‌పై ఎక్కించుకుని వెళ్లిపోయారు. ప్రత్యక్ష సాక్షులు డయల్ 100కు సమాచారం అందించడంతో హైఅలర్ట్ యాప్ ద్వారా కిడ్నాపర్ల కదలికలను అనంతపురం రూరల్ పోలీసులు పసిగట్టి, ఎన్‌ఎస్ గేటు మీదుగా రామగిరి వైపు వెళ్తున్న వారిని చెన్నేకొత్తపల్లి పోలీసుల సాయంతో అదుపులోకి తీసుకున్నారు. సీఐ విజయభాస్కర్ గౌడ్ ఆదేశాలతో ఎస్‌ఐలు నబీరసూల్, వెంకటరమణ, సిబ్బంది చెన్నేకొత్తపల్లికి వెళ్లి కిడ్నాపర్లను అనంతపురం రూరల్ పోలీస్ స్టేషన్‌కు పిలుచుకొచ్చారు. కిడ్నాప్‌కు పాల్పడిన అమ్మాయి తండ్రి, ఆయన కుమారుడు, మరో ఇద్దరిపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు ఎస్‌ఐ వెంకటరమణ తెలిపారు.

యాచకుడి మృతి



మృతదేహం

పెనుకొండ: గుర్తు తెలియని ఓ యాచకుడు మృతి చెందిన ఘటన పట్టణంలోని కృష్ణదేవరాయ జంక్షన్‌లో శనివారం చోటుచేసుకుంది. ఎస్‌ఐ రమేష్‌బాబు తెలిపిన మేరకు.. మృతుడు కొన్ని రోజులుగా పట్టణంలో యాచన చేస్తూ జీవిస్తున్నాడు. శనివారం స్థానిక జంక్షన్‌లోని నగర పంచాయతీ బోర్ రూం వద్ద విగతజీవిగా పడి ఉండడం గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారమిచ్చారు. మృతుడికి 50 సంవత్సరాల వయసు ఉంటుందని, ఏ ప్రాంతానికి చెందిన వాడన్న విషయం తెలియదని ఎస్‌ఐ తెలిపారు. అనాథ శవంగా పరిగణించి పూడ్చి వేయనున్నట్లు పేర్కొన్నారు.

జాతీయ సదస్సులో పాల్గొన్న వీసీలు



సదస్సులో పాల్గొన్న జేఎన్‌టీయూ వీసీ జింకా రంగజనార్ధన, ఎస్కేయూ వీసీ ఎం. రామకృష్ణారెడ్డి

అనంతపురం: మేఘాలయాలోని యూనివర్సిటీ ఆఫ్ ఈస్ట్‌జోన్‌లో మూడు రోజులుగా జరుగుతున్న జాతీయ స్థాయి వైస్ చాన్సలర్స్ సదస్సుకు జేఎన్‌టీయూ (ఏ) వీసీ జింకా రంగజనార్ధన, ఎస్కేయూ వీసీ మాచిరెడ్డి రామకృష్ణారెడ్డి హాజరయ్యారు. 'ఆత్మనిర్భర్ భారత్ కోసం పరివర్తనాత్మక ఉన్నత విద్య' అంశంపై సదస్సు నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. యూనివర్సిటీ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ మేఘాలయలోని సెంట్రల్ ఆడిటోరియంలో ఏర్పాటు చేసిన ఈ సదస్సుకు దేశ వ్యాప్తంగా ఉన్న అన్ని యూన్సివర్సిటీల వైస్ చాన్సలర్లు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఉన్నత విద్యారంగంలో నెలకొన్న సమస్యలు, వాటి పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలను ఎస్కేయూ, జేఎన్‌టీయూ (ఏ) వీసీలు చర్చించారు.

ఆర్థిక పటిష్టతకు చర్యలు తీసుకోండి

- డీసీసీబీ ఛైర్‌పర్సన్ ఎం.లిఖిత



మాట్లాడుతున్న డీసీసీబీ ఛైర్‌పర్సన్ ఎం.లిఖిత

అనంతపురం అగ్రికల్చర్: జిల్లా కేంద్ర సహకార బ్యాంకు (డీసీసీబీ), ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల (పీఏసీఎస్) ఆర్థిక పటిష్టతకు చర్యలు తీసుకోవాలని, ఇందులో భాగంగా రూ.71 కోట్ల మొండి బకాయిల వసూలుపై ప్రత్యేక దృష్టి సారించాలని డీసీసీబీ ఉద్యోగులను ఆ బ్యాంక్ ఛైర్‌పర్సన్ ఎం.లిఖిత ఆదేశించారు. శనివారం స్థానిక డీసీసీబీ హాలులో బ్యాంక్ సీఈఓ ఏటీ రామ్‌ప్రసాద్ అధ్యక్షతన డీసీసీబీ 124వ మహాజన సభ జరిగింది. ఈ సందర్భంగా లిఖిత మాట్లాడుతూ... 6.72 శాతం ఉన్న మొండిబకాయిల వసూళ్లకు సరైన కార్యాచరణ చేపట్టాలన్నారు. రైతులు, ఇతర అన్ని వర్గాలకు మరింత నాణ్యమైన బ్యాంకింగ్ సేవలు, రుణాలు అందించేందుకు వీలుగా వివిధ వర్గాల నుంచి పెద్ద ఎత్తున డిపాజిట్లు సేకరించాలన్నారు. డిపాజిట్లపై అందజేస్తున్న వడ్డీరేట్లపై ప్రజలను చైతన్య పరచాలని సూచించారు. వివిధ పథకాల అమలులో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కల్పించిన భాగస్వామ్యాన్ని సద్వినియోగం చేసుకుంటే సహకార బ్యాంకులు, సొసైటీలు ఆర్థిక పరిపుష్టి సాధించడం ఖాయమన్నారు. ఇటీవల సహకార చట్టంలో సవరణలు చేశారని, అందులో ఆర్‌బీకేలను సొసైటీలతో అనుసంధానం చేయడం, సొసైటీల్లో ఇక నుంచి రెండు ఆడిట్లు నిర్వహించడం, సంఘాలతో విచారణ చేపట్టాలంటే ఫైనాన్సియల్ బ్యాంక్ ఆమోదం తీసుకోవడం, సహకార సంఘాల్లో ఏ సభ్యుడైతే వ్యాపారం చేస్తారో వారికే ఓటు హక్కు కల్పించడం, బ్యాంకు సీఈవోల నియామకానికి స్టేట్ లెవెల్ ప్యానెల్ ఏర్పాటు, కామన్ సర్వీసు సెంటర్ల ఏర్పాటు ద్వారా బస్సు, రైలు, విమానం టికెట్ల సదుపాయం కల్పించడం, ప్రతిసంఘం కంప్యూటరీకరణ చేపట్టి క్యూఆర్ కోడ్ కల్పించడం లాంటి సవరణల గురించి అధ్యయనం చేయాలన్నారు. పాలకవర్గం, అధికార యంత్రాంగం కలిసికట్టుగా పనిచేసి ఈ ఆర్థిక సంవత్సరంలో రూ.2 వేల కోట్ల టర్నోవర్ సాధించాలని పిలుపునిచ్చారు. మహాజన సభలో రెండు జిల్లాల డీసీఓలు ఎం.ప్రభాకరరెడ్డి, కృష్ణానాయక్, నాబార్డు డీడీఎం అనురాధ, డైరెక్టర్లు శంకరరెడ్డి, జనార్ధన్‌రెడ్డి, రామాంజినేయులు, ప్రొఫెషనల్ డైరెక్టర్లు రమణమూర్తి, అబ్దుల్ రశీద్, బ్యాంకు జీఎం కె.సురేఖారాణి, డీజీఎంలు సుఖదేవబాబు, రవికుమార్, పి.యాలేరు సొసైటీ అధ్యక్షుడు తోపుదుర్తి ఆత్మారామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రండి బాబూ రండి..



జనం లేక వెలవెలబోతున్న లోకేష్ బహిరంగ సభ



ఓడీ చెరువు సమీపంలో మద్యం తాగుతున్న కార్యకర్తలు

- యువగళం పాదయాత్రకు జనం కరువు

పుట్టపర్తి టౌన్: మద్యం, డబ్బు ఎరగా వేస్తున్నా నారా లోకేష్ చేపట్టిన యువగళం పాదయాత్రకు జనం కరువవుతున్నారు. తమ్ముళ్లు ఆసక్తి చూపకపోతుండడం నేతల తలమీదికొస్తోంది. శనివారం ఓడీ చెరువు మండలం ఒనుకువారిపల్లి వద్ద 9 గంటలకు ప్రారంభం కావాల్సిన లోకేష్ పాదయాత్ర కార్యకర్తలు, నాయకులు, పెయిడ్ ఆర్టిస్టులు తొందరగా రాకపోవడంతో గంట ఆలస్యంగా ప్రారంభమైంది. ఇక.. ఓడీసీలో నిర్వహించిన బహిరంగ సభకూ జనం కరువయ్యారు. జనం లేక సభా ప్రాంగణం వెలవెలబోయింది. లోకేష్ ప్రసంగిస్తుండగానే కొంతమంది వెళ్లి పోయారు.

మద్యం షాపులు బిజీ..

నారా లోకేష్ పుణ్యమాని మద్యం షాపులు మాత్రం కిటకిటలాడాయి. మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డితో పాటు ఇతర నాయకులు చినబాబు వద్ద తమ సత్తా నిరూపించుకొనేందుకు నానా తంటాలు పడ్డారు. వెయ్యి రూపాయలు, లీటర్ పెట్రోల్, మద్యం ఎర వేస్తూ నియోజకవర్గవ్యాప్తంగా ఎవరికి వారు ప్రతి గ్రామం నుంచి కార్యకర్తలను తరలించారు.

సమావేశాలు నిర్వహించకుండానే..

పాదయాత్రలో భాగంగా గాజుకుంటపల్లి వద్ద రైతులతో ముఖాముఖి, వడ్డేపల్లిలో ఎస్టీ సామాజికవర్గాలతో సమావేశం, తహసీల్దార్ కార్యాలయం వద్ద మైనార్టీలతో ముఖాముఖి నిర్వహించాలని షెడ్యూల్ ఉంది. అయితే, సమావేశాలు నిర్వహించని లోకేష్ వారిచ్చిన వినతి పత్రాలు స్వీకరించి సెల్ఫీలు దిగి ముందుకు కదిలారు.

ప్రజలకు ఇబ్బందులు..

పాదయాత్రకు వస్తున్న 'తమ్ముళ్లు' ఎలా పడితే అలా రోడ్లపై ప్రయాణించడంతో ప్రజలకు కష్టాలు తప్పలేదు. గోరంట్ల, కదిరి రహదారి మార్గంలో అంబులెన్స్‌కు సైతం దారి దొరక్క రోగులు ఇబ్బంది పడాల్సి వచ్చింది. ఇక.. పుట్టపర్తి అసెంబ్లీ సీటు పల్లె రఘునాథరెడ్డికి కేటాయించకూడదంటూ కొంతమంది తెలుగు తమ్ముళ్లు నిరసన వ్యక్తం చేసినట్లు తెలిసింది. వడ్డే వెంకట్, జగలేటి శ్రీనివాసులు ఇద్దరూ 'పల్లె'కు పోటాపోటీగా ఫ్లెక్సీలు ఏర్పాటు చేయడంతో మాజీ ఎమ్మెల్యే అనుచరులు నిరాశ చెందినట్లు సమాచారం.

28న ఉద్యోగ మేళా

అనంతపురం సప్తగిరి సర్కిల్: ఐసీఐసీఐ బ్యాంకులో ఉద్యోగాల భర్తీకి ఈ నెల 28న ఏఎఫ్ ఎకాలజీ సెంటర్ వేదికగా ఎన్‌ఐటీ ఆధ్వర్యంలో జాబ్‌మేళా నిర్వహించనున్నారు. ఈ మేరకు సెంటర్ డైరెక్టర్ మల్లారెడ్డి శనివారం ఓ ప్రకటన విడుదల చేశారు. డిగ్రీ, పీజీ, ఇంజినీరింగ్ విద్యార్హత, 20 నుంచి 25 ఏళ్ల లోపు వయసున్న వారు అర్హులు. ఎంపికైన వారికి 30 రోజుల శిక్షణ అనంతరం ఉమ్మడి తెలుగు రాష్ట్రాల్లోని ఐసీఐసీఐ బ్యాంక్ శాఖల్లో రిలేషన్‌షిప్ మేనేజర్లుగా ఉద్యోగాలను కల్పిస్తారు. వీరికి నెలకు రూ.20 వేల నుంచి రూ.22 వేల వరకూ జీతం అందజేస్తారు. ఆసక్తి ఉన్న వారు పూర్తి బయోడేటా, విద్యార్హత ధ్రువీకరణ పత్రాలతో జాబ్ మేళాకు హాజరు కావాలి.